





నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

బుధవారం | 11 ఫిబ్రవరి 2026

పేజీలు 8


## అమృత్ పనులను
# వేగవంతం చేయండి

- కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు
- డోన్-సికింద్రాబాద్ మధ్య స్టేషన్ల తనిఖీ
- విస్తృతంగా పరిశీలించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



కర్నూలు రైల్వే స్టేషన్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌లో రూ.46.62 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ పథకం కింద జరుగుతున్న పునరాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు. మంగళ వారం ఆయన డోన్ నుండి సికింద్రాబాద్ మధ్య రైల్వేస్టేషన్లను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అమృత్ పథకం కింద దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ చేస్తున్నామని ఆయన చెప్పారు.ఒక్క రోజు పర్యటనలో కర్నూలు సిటీ,

మిగతా 2లో



హంస వాహనం పై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు

## హరోం..హర..
# శంకరా..!

- హంస వాహనంపై దర్శనమిచ్చిన ఆది దంపతులు
- స్వామి అమ్మవార్లను దర్శించుకుని పులకించిన భక్తజనం
- నేడు టీటీడీ,కాణిపాకం దేవస్థానం వారిచే మల్లన్నకు పట్టు వస్త్రాలు సమర్పణ








**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ఇల కైలాసమైన శ్రీశైల పుణ్య క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లకు హంస వాహనసేవనిర్వహిం చారు. అమ్మవారి ఆలయం సమీపంలోని అక్కమ హాదేవి అలంకార మండపంలో హంస వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఆశీనులను చేసి ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. మంగళవాయిద్యాలు మారుమోగగా,భక్తుల శివన్నామస్మరణతో హంసవాహనాధీశులైన స్వామి అమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించారు.

మిగతా 2లో




హంస వాహనం పై ఆశీనులైన స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# తితిదే 'లడ్డూ' పై తెదేపా అసత్య ప్రచారాలు

- హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు
- తెదేపా హయాంలోనే తితిదేకు దొడ్డిదారిన చేరిన బోలేబాబా ట్యాంకర్లు
- నంద్యాల వైకాపా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు విషయంలో రాష్ట్రంలోని అధికార పక్ష తెదేపా కూటమి పదే పదే అబద్ధాలు చెబుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోందని వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రె డ్డి ఆరోపించారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తోందని ఆయన మండిపడ్డారు. మంగళవార తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

## భక్తుల ఓంకారనాదంతో
# మారుమ్రోగిన నల్లమల

- లింగోద్భవ దర్శనం కోసం భక్తుల అడుగులు
- ఆడవి మార్గంలో అడుగడుగునా అన్నదానం,సహాయక చర్యలు
- అటవీ అధికారుల ఆంక్షలు..ఇబ్బందుల్లో పాదయాత్రికులు
- అటవీ అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** భువిపై వెలిసి కైలాసంగా, ద్వాదశ జ్యోతిర్లింగ మహక్షేత్రంగా పేరొందిన శ్రీశైలం క్షేత్రంలో వెలిసిన శ్రీభ్రమరాంమ మల్లికార్జున స్వామి వార్లను శివరాత్రి నాడు దర్శించుకునేందుకు భక్తు లు, శివస్వాములు వ్యయప్రయాసాలకు నోచుకోని ఆ పరమశివుడిపై భారం వేస్తు అడవీ మార్గంలో పాదయాత్ర కొనసాగిస్తున్నారు. గంగా నదిలో మునిగినా, కాశీక్షేత్రం లో నివసించినా వచ్చేంత పుణ్యం శ్రీశైలం క్షేత్రాన్ని దర్శిస్తే లభిస్తుందనే భక్తుల నమ్మకం.

మిగతా 2లో





అటవీ మార్గంలో కాలినడకన వెళ్తున్న భక్తులు

# పారిశుద్ధ్యం పై చి(చె)త్తశుద్ధి ఉండాలి..!

- పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యపు ఛాయలు
- తీరుమార్చుకొని పంచాయతీ కార్యదర్శులు
- గతంలో నోటీసులు ఇచ్చినా మార్పు శూన్యం
- చోద్యం చూస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

2లో




జిల్లా పంచాయతీ కార్యాలయం

# అదిగదిగో శ్రీశైలం..

- నల్లమల అడవుల్లో పాదయాత్రగా తరలివస్తున్న భక్తులు
- మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- జ్యోతిర్ముడి శివస్వాములకు స్పర్శ దర్శనం

2లో



నల్లమల మీదుగా పాదయాత్రగా వస్తున్న భక్తులు

సూర్య www.suryaa.com



# హరోం..హర..శంకరా..!

(మొదటి పేజీ తరువాయి)



అనంతరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు గంగాధర మండపం వద్ద స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు అక్కడి నుంచి బయలువీర భద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో వివిధ కళారూపాలు,డప్పు వాయిద్యాలు,కర్ణాటక నృత్యాలు, డోలు, బీరప్పలు,మహిళల కోలాటం,కళాకారుల నృత్యాలు గ్రామోత్సవానికి మరింత వన్నె తెచ్చాయి. హంస వాహనాధీశు లైన స్వామి అమ్మవార్లను భక్తులు కనులారా దర్శించి ప్రత్యేక నీరాజ నాలు సమర్పించారు.

**శ్రీశైలంలో నేడు.. :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు బుధవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లు మయూర వాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అలాగే ఉదయం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానం,సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే శ్రీశైల మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

## అమృత్ పనులను వేగవంతం చేయండి



అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న రైల్వే జనరల్ మేనేజర్

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌బిబి జోగులాంబ, గద్వాల్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్ రైల్వే స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. డోన్ నుండి సికింద్రాబాద్ సెక్షన్ వరకు రియర్ విండో తనిఖీ చేసిన ఆయన ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థలను, వంతెనలకు సంబంధించిన భద్రతా అంశాలను తనిఖీ చేసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇక, తెలంగాణాలోని జోగుళాంబ రైల్వే స్టేషన్‌లో రూ. 6.7 కోట్ల వ్యయంతో నిర్వహిస్తోన్న పునరాభివృద్ధి కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. కృష్ణా నది వద్ద వంతెన భద్రతను ఆయన పరిశీలించారు. అరేపల్లి వద్ద వెవల్ క్రాసింగ్ గేట్ మ్యాన్‌తో ఆయన మాట్లాడారు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పరిశీలనలో భాగంగా పర్యటించిన శ్రీవాస్తవను పలు ప్రజా సంఘాల నేతలు కలిసి విన తి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిప్రాంతమైన విజయవాడకు కర్నూలు నుండి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపాలని ఈ సందర్భంగా ఆయనకు వినతి పత్రం సమర్పించారు.

## తితిదే 'లడ్డూ'పై తెదేపా అసత్య ప్రచారాలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో తెదేపా కూటమి అధికారంలోకి వచ్చాక బోలేబాబా నెయ్యితో వచ్చిన ట్యాంకర్లు నాణ్యత లేనివిగా తేలినా తిరిగి తితిదేకు చేరాయని సిబిఐ సిట్ తేల్చి చెప్పినా దాన్ని విస్మరిస్తూ వైకాపాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విరుచుకుపడ్డారు. దొడ్డిదారిన బోలేబాబా నెయ్యి తిరిగి తితిదేకు చేరిన సమయంలో రాష్ట్రంలో ఎవరి ప్రభుత్వం ఉందని ఆయన ప్రశ్నించారు. జంతువుల కొవ్వు, పంది కొవ్వు, ఫిష్ ఆయిల్‌ను లడ్డూ తయారీలో కలిపారని ఆరోపిస్తూ వచ్చిన కూటమి ప్రభుత్వం సిబిఐ అలాంటివేవీ అందులో లేవని తేల్చి చెప్పిన తర్వాత బాత్రూం శుభ్రం చేసుకునే ఫినాయల్ లాంటివి లడ్డూలో కలిపారని మాట మారుస్తోందని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా కర్నూలు జిల్లా పర్యటనలో ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడమేమిటని ఆయన నిలదీశారు. ప్రపంచంలోనే పవిత్రమైన పుణ్యక్షేత్రంలో లడ్డూ తయారీ విషయంలో కూటమి చేస్తున్న విషప్రచారాన్ని ఇకనైనా ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. హిందువుల మనోభావాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోందని, హిందువులు గమనించాలని ఆయన కోరారు. రాజకీయ స్వార్థంతో జగన్ మీద ఉన్న కోపంతో హిందూ పవిత్రతను దెబ్బతీసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు.

## యాళ్లూరు గ్రామానికి షాదీఖానాకు గ్రీన్ సిగ్నల్




మాట్లాడుతున్న ఫయాజ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండల యాళ్లూరు గ్రామంలో ముస్లిం మైనార్టీ సోదరుల కోసం షాదిఖాన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా షాదిఖాన నిర్మాణానికి కృషి చేసిన ఎన్ఎండి ఫిరోజ్, ఎన్ఎండి ఫయాజ్‌లను యాళ్లూరు గ్రామ మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయడం ఆనందంగా ఉందన్నారు. గోస్పాడు మండలంపై ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గత పాలకులు ప్రజలను మభ్య పెడుతూ మోసం చేశారని విమర్శించారు. మంత్రి ఫరూక్ నాయకత్వంలో మసీదులు, షాదిఖానాలు, ఈద్గాలకు మరమ్మత్తులకు నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఈ కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మణియార్ ఖలీల్, తులశీశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల ఓంకార నాదంతో మారుమ్రోగిన నల్లమల

(మొదటి పేజీ తరువాయి)

ఆ నమ్మకంతోనే శివరాత్రి పర్వదినాన ద్వాదశ జ్యోతిర్లింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా నల్లమల అటవీ ప్రాంతంలో పాదయాత్రగా వెళ్తున్నారు. అత్యంత నిష్టతో ఇరుముడులు కట్టుకొని స్వామి వారికి అర్పించేందుకు హరహర మహాదేవా శంభో శంకరా అంటూ భక్తుల గొంతులతో నల్లమల అటవీ ప్రాంతం మారుమ్రోగుతోంది. పరమ శివుడి లింగరూపంలో కనిపించే నిషితకాలమైన శివరాత్రి నాడు ఆత్మ లింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు శ్రీశైల క్షేత్రం వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర నలమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నుంచి కూడా భక్తులు పాదయాత్రగా శ్రీశైల క్షేత్రం వెళ్తున్నారు. అటవీ మార్గంలో దాదాపు 40 కి.మీ మేర పాదయాత్ర కొనసాగిస్తే శ్రీశైలం చేరుకోవచ్చు. అటవీ మార్గంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జిల్లా కలెక్టర్ అధికారులతో సహాయక చర్యలు చేపట్టారు. అటవీ శాఖ అధికారులు భక్తులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు మార్గం తెలిపే సూచికలను ఏర్పాటు చేశారు. వైద్యారోగ్య శాఖ వారు అటవీ మార్గంలో ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులను భక్తులకు అందిస్తున్నారు. అలాగే అధికారుల, దాతలు, ఆలయ కమిటి వారి ఆధ్వర్యంలో భక్తులకు ఆహారం, అల్పాహారం, పండ్లు, తాగునీరు, మజ్జిగ లాంటివి అందిస్తున్నారు. ఇలా పాదయాత్రగా వెళ్లే శివ భక్తులకు అడుగడుగునా సహాయ చర్యలు అందుతున్నాయి. నంద్యాల జిల్లాలో వెలిసిన శ్రీశైలం క్షేతాన్ని కాలినడకన చేరుకోవాలంటే ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామం నుంచి వెళ్లాల్సిందే. ఆత్మకూరు నుంచి రోడ్డు మార్గాన 7 కి.మీ ప్రయాణిస్తే వెంకటాపురం



భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన దృశ్యం

గ్రామం చేరుకోవచ్చు. అక్కడ వెలిసిన శ్రీనందీశ్వర ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు నిత్యఅన్నదానం చేస్తారు. ఇక్కడే నుంచి పాదయాత్ర మొదలవుతుంది. వెంకటాపురం గ్రామం నుంచి అటవీ మార్గంలో 6. కి.మీ నడిస్తే గోసాయికట్ట లేదా బైర్లూటి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం చేరుకుంటారు. ఇక్కడ అసరమైతే సేదతీరవచ్చు దాతలు, ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి 9కి.మీ నడిస్తే నాగులూటి వీరభద్ర స్వామి ఆలయం చేరుకోగా ఇక్కడ భక్తులు సేద తీరేందుకు అన్ని ఏర్పాటు ఉన్నాయి. ఇక్కడి నుంచే మెట్ల మార్గం 8 కి.మీ దూరంలో దామర్లకుంట, అక్కడి నుంచి 2 కి.మీ నడిస్తే పెచ్చెర్వు చేరుకుంటారు. ఇక్కడ కూడా భక్తులు సేద తీరేందుకు అన్ని ఏర్పాట్లు ఉంటాయి. ఇక్కడ నుంచి 6 కి.మీ కొండమార్గంలో ప్రయాణిస్తే మఠంబావి చేరుకోవచ్చు. అక్కడ నుంచి 3. కి.మీ భీముని కొలను, అక్కడి నుంచి 2.కి.మీ మెట్ల మార్గం ద్వారా నడిస్తే కైలాస ద్వారం, అక్కడి నుంచి 4.కి.మీ రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలం చేరుకుంటారు. అటవీ మార్గంలో కాలినడకన శివరాత్రి పర్వదినాన జ్యోతిర్లింగాన్ని దర్శించుకోవాలనే తపనతో భక్తులు శివనామస్మరణతో శ్రీగిరివైపు అడుగులు వేస్తు శ్రీశైలం చేరుకునేందుకు పాదయాత్ర కొనసాగిస్తున్నారు.

**అటవీ అధికారుల ఆంక్షలు ... ఇబ్బందుల్లో**



భక్తుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న అటవీ శాఖ అధికారులు

**భక్తులు :** శ్రీశైలం పాదయాత్రగా వెళ్లే భక్తులు ప్రతి ఏటా స్వేచ్ఛగా శివనామస్మరణ చేసుకుంటూ కాలినడకన ముక్కంటేశుని చేరుకొనేవారు. అయితే ఈ ఏడాది అడవి అధికారులు ప్లాస్టిక్ నిషేధం అంటూ పెట్టిన ఆంక్షల మధ్య నడక సాగతోంది. కాలినడకన వెళ్లే భక్తులను నాగులూటి వీరభద్రాలయ సమీపంలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసి అటవీ అధికారులు బ్యాగ్‌లను తనిఖీలు చేస్తు తినుబండారాలు, వాటర్‌బాళ్లు, కనీసం చిన్నారులు తినేందుకు బిస్కెట్‌ప్యాకెట్లను కూడా అడవిలోకి అనుమతించకపోడంతో అటవీ అధికారుల తీరుపై భక్తులకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీళ్ళ బాటిళ్లు ఉంటే ఇక్కడే తాగి వెళ్ళాలని ఖరాఖండిగా చెప్పడంతో గతిలేని పరిస్థితుల్లో నడక సాగిస్తున్నారు. కాలినడక సాగించాలంటే కేవలం వెంకటాపురం గ్రామం నుంచి మాత్రమే అనుమతించడం జరుగుతుందని ఖరాకండిగా చెబుతున్నారు. గతంలో బైర్లూటి, ఎస్ఎన్‌తాండా తదితర ప్రాంతల్లో ఎక్కడ వీలుంటే అక్కడి నుంచి అడవి మార్గంలోకి చేరుకొని పాదయాత్ర చేసేవారు. ఏది ఏమైన అటవీ శాఖ అధికారుల ఆంక్షలు భక్తులకు ఇబ్బందికరంగా ఉన్నాయని, ఆ శివయ్య భక్తులను అడ్డగిస్తే ఆ శివుడు తప్పక శిక్షిస్తాడంటూ ఆగ్రహావేశాలతో భక్తులు పాదయాత్రను ముందుకు సాగిస్తున్నారు.

# పారిశుద్ధ్యంపై చి(చె)త్తశుద్ధి ఉండాలి..!

**కర్నూలు,మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య మెరుగుదల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను నిధులను వెచ్చిస్తూ చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు, జీరో వేస్టేజ్ వంటి బృహత్తర కార్యక్రమాలు అమలు చేస్తుంది. ప్రజారోగ్యం, పరిశుభ్రతపై ప్రభుత్వం ఒక కార్యదీక్షతో కార్యచరణ చేస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల పర్యవేక్షణ లోపం కార్యదర్శుల నిర్లక్ష్యం వెరసి పారిశుద్ధ్యం పడకేసింది. ముఖ్యంగా ప్రజల నుండి నేరుగా సమాచారం సేకరించే ఐవిఆర్ఎస్(వాయిస్ కాల్స్) నివేదికలు అధికారుల పని తీరును బట్టబయలు చేస్తున్నాయి. మీ ఇంటి నుండి చెత్త సేకరణ జరుగుతుందా..?వారానికి కనీసం రెండుసార్లు అయినా మీ ఇంటి నుండి చెత్తను సేకరిస్తున్నారా..?అని అడిగిన ప్రశ్నలకు ప్రజల నుండి వచ్చిన సమాధానాలు అధికారుల డొల్లతనాన్ని బయటపెట్టాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న దాదాపు 26మండలాల పరిధిలోని సుమారు 463గ్రామ పంచాయతీల పనితీరును విశ్లేషిస్తే ఫలితాలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఇందులో సుమారు 20మండలాలు, గ్రామ పంచాయతీలు, పారిశుద్ధ్య నిర్వహణలో అట్టడుగు స్థాయికి పడిపోయాయి. అత్యల్ప పనితీరు జాబితాలో ఉన్న గ్రామాల నుండి వచ్చిన సానుకూల స్పందన అక్షరాల సున్నా శాతం. గత డిసెంబరు నెలలో వెలువడిన ఐవిఆర్ఎస్ నివేదికలో అనేక గ్రామాలు సున్నా శాతం పనితీరు కనబరచడంతో అప్పట్లో 14మంది పంచాయతీ కార్యదర్శులకు జిల్లా అధికారులు నోటీసులు జారీ చేశారు. తీరు మార్చుకుంటామని వివరణ ఇచ్చినప్పటికీ జనవరి నెల నివేదికలోనూ పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రాలేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా కౌతాళం మండలంలోని చూడి, గుడికంబాలి, కుంబళనూరు, హాల్వి, ఆలూరు మండలంలోని కురుకుంద, మొలగవల్లి కొట్టాల, ఆస్పరిలోని తొగలగల్లు, బిల్లేకల్లు, బిణిగేరి, కోసిగి మండలంలోని ఐరనగల్లు, కడిదొడ్డి, గౌడేగల్లు, సి బెళగల్, మారందొడ్డి, కృష్ణగిరి, ఆగవెల్లి, మద్దికెర మండలంలోని యరవలి గ్రామాల్లో ప్రజల నుండి ఒక్కటంటే ఒక్క సానుకూల స్పందన కూడా రాలేదు. ఇక ఆస్పరి, బైచిగేరి, మంత్రాలయం, మాధవరం తాండ, కౌతాళం, హాల్వి, కోసిగి, పెద్దకడుబూరు, చిన్న కడుబూరు, దేవనకొండ, చిన్నహ్యాట, పాండవగల్లు వంటి గ్రామాల్లో కేవలం 10నుండి 20శాతం లోపు మాత్రమే సానుకూల స్పందన లభించింది. ఇది కేవలం 2నెలల నివేదిక మాత్రమే కాదు గత సంవత్సర కాలం నుండి ప్రతి నెలా వెలువడుతున్న నివేదికల్లో కార్యదర్శుల పనితనం అద్వాన్నంగానే ఉంటుంది. ప్రతి నెలా నివేదికలు రావడం అందులో అలసత్వం స్పష్టంగా కనిపిస్తుండడం సర్వసాధారణమైపోయింది. గతంలో నోటీసులు ఇచ్చినప్పుడు హడావుడి చేసిన అధికారులు ఇప్పుడు ఇంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా వివరణ కోరకపోవడం కఠినమైన క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అన్న ప్రశ్నలు సామాన్యుల నుండి వినిపిస్తున్నాయి. అధికారుల ఈ ఉదాసీన వైఖరి చూస్తుంటే క్షేత్రస్థాయి సిబ్బందికి పరోక్షంగా మద్దతు పలుకుతున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అనుకున్న స్థాయిలో జరగడం లేదు. వీధులన్నీ చెత్త మయంగా మారుతున్నాయి. కానీ కార్యదర్శులు మాత్రం తప్పుడు నివేదికలతో పాత ఫోటోలతో జిల్లా స్థాయి అధికారులను మభ్య పెడుతున్నారని పశ్చిమ ప్రాంతంలో కోడై కూస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనులు చేయకుండానే అంతా బాగున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ తమ నిర్లక్ష్యపు ధీమాను ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వాలు నిబద్ధతతో పనిచేస్తుంటే క్షేత్రస్థాయిలో అధికారులకు ఆటలు అయ్యాయని ప్రజలు వ్యంగంగా చర్చించుకుంటున్నారు. ఇంత దారుణమైన ఫలితాలు వస్తున్నా జిల్లా అధికారి మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా..లేక గ్రామాలు చెత్తకుప్పలుగా మారుతున్నా..చూస్తూ ఊరుకుంటారా..అనేది వేచి చూడాలి.

## శివస్వాములపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గమైన చర్య

**పత్తికొండ, మేజర్ న్యూస్:** శ్రీశైల మాలధారణ శివ స్వాములపై లాఠీచార్జీ చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని బిజెపి అసెంబ్లీ కో-కన్వీనర్ గోవర్ధన్ నాయుడు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, శ్రీశైలంలో శివ భక్తులపై అడిషనల్ ఎస్పీ సమక్షంలో లాఠీ చార్జిచేయడం దుర్మార్గమని ఎంతో భక్తిశ్రద్దలతో శివస్వాములు ఇరుముడులు కట్టుకొని శివరాత్రికి ముందు పాదయాత్రగా శ్రీశైలంకు చేరుకొని మొక్కులు తీర్చుకోవాలనే సంకల్పంతో అక్కడికి చేరుకున్న శివస్వాములపై లాఠీచార్జీ చేయడం ఎంతో దుర్మార్గమైన చర్యలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బల ప్రయోగం చేయడం సమాంజసం కాదన్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నంద్యాలలో 'శాప్' లీగ్ పోటీలు..

-17న చదరంగం, 24న సైక్లింగ్ -ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

-విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీల్లో అవకాశం -జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం ఎన్ వి రాజు వెల్లడి



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగిఉన్నక్రీడాప్రతిభను వెలికితీసేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) రూపొందించిన 2026 స్పోర్ట్స్ క్యాలెండర్‌లో భాగంగా నంద్యాలలో లీగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి చదరంగం , సైక్లింగ్ విభాగాల్లో నంద్యాల డీఎస్ఏ స్టేడియం వేదికగా పోటీలు జరగనున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం ఎన్ వి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

**పోటీల వివరాలు ఇలా ఉన్నాయి:** ఈ నెల 17న నంద్యాల డీఎస్ఏలో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయి. ఇందులో ఎంపికైన వారు ఫిబ్రవరి 21, 22 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ నెల 24న సైక్లింగ్ నంద్యాల డీఎస్ఏలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారు. విజేతలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 1 వరకు విజయవాడలో (ఎన్టీఆర్ జిల్లా) జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు.

**పేర్ల నమోదు ఇలా..:** ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు తప్పనిసరిగా సాప్ అధికారిక వెబ్‌సైట్ ఊఊఊ.ఆజూశీఊం.ఞజూ.ర్రశీఙ.ఱఅ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. గెలుపొందిన క్రీడాకారులకు యాప్ ద్వారానే ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్లు) జారీ చేస్తారు. మరిన్ని వివరాలకు 87126 22576 నంబరులో సంప్రదించవచ్చు.

## విద్యార్థులు స్టడీ అవర్స్ ను సద్వినియోగం చేసుకోవాలి - ఎంపీడీవో



**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరూ ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ ను వినియోగించుకోవాలని పదో తరగతి పరీక్షలతో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆళ్లగడ్డ ఎంపీడీవో నూర్జహాన్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆమె పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన బోధన , మార్గ నిర్దేశం అందించాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు.

## శనగలో సస్యరక్షణ చర్యలు పాటించాలి-ఏఓ



**సి.బెళగల్,మేజర్ న్యూస్ :** శనగ,మినుము పంటలలో కాయతొలుచు పురుగు నివారణ మరియు చర్యలు పాటించాలని రైతు సోదరులకు ఏఓమల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం పోలకల్ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి ఈ సందర్భంగా శనగ,మినుము పంటలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకువాలని అందుకు కాయతొలుచు పురుగు, కుంకుమ తెగులు నివారణకు వేపనూనె,స్పైనోసాడు అధికారుల సూచన మేరకు పిచికారీ చేయాలనీ సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిఈఓ లు, ఆర్ఎస్కే సిబ్బంది శశికాంత్ మరియు రైతు సోదరులు రాఘవరెడ్డి, సోమిరెడ్డి,సిమన్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ



**పాములపాడు,మేజర్‌న్యూస్:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో "టీబీ ముక్త పంచాయతీ" కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో తిరుపాలు, ఏఓ,సరళ, డాక్టర్ నాగలక్ష్మి,ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులు, పోషకాహార ఫుడ్ బాస్కెట్లు అందజేశారు. గ్రామాల్లో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలను క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పెద్ద మస్తానయ్య, రవికుమార్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనిదినాలను పెంచాలి

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతలలో చేపడుతున్న ఉపాధి హామీ పని దినాలను పెంచాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాసింవలి డిమాండ్ చేశారు. మంగళవారం వ ఉదల కేంద్రమైన గోనెగండ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాది కింద పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని కోరారు. రాష్ట్ర పంచాయతీల అధికారాన్ని పునరుద్ద రించాలని కోరారు. ఈ నెల 17 న ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి గ్రామీణ ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా కర్నూలు జిల్లాలోని గార్గెయపురం, పత్తికొండలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబందించిన వాల్ పోస్టర్లున్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గోనెగండ్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసింవలి, ఎన్ఎస్ఈయూఐ జిల్లా నాయకుడు వీరేష్, యువజన కాంగ్రెస్ నాయకులు వసమ, ముస్తాఫా, బాషా, రఫీక్, నబిరసూల్, కాజా, సబాల్ పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న అహోబిలం పుష్కరిణి

-'స్వచ్ఛ అహోబిలం'లో భాగంగా పూడికతీత పనులు

-చక్రస్నానం, తెప్పోత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** ప్రముఖ శ్రీ వైష్ణవ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ పుష్కరిణి (కోనేరు) సిద్ధమవుతోంది. బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన చక్రస్నానం, తెప్పోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం పుష్కరిణిలో పూడికతీత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ అహోబిల మఠం సి.ఎ.ఓ వి.ఎల్.ఎన్. రామానుజన్ స్వయంగా ఈ పనులను పర్యవేక్షించారు.

**80 మంది సిబ్బందితో శ్రమదానం:** గత నెలలోనే దిగువ అహోబిలంలోని కోనేరు నుంచి దాదాపు 200 మంది కూలీలతో నీటిని పూర్తిగా తొలగించారు. అయితే అడుగునపేరుకుపోయిన మట్టి, పూడికను తొలగించేందుకు మంగళవారం 'స్వచ్ఛ అహోబిలం' పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. సి.ఎ.ఓ రామానుజన్ ఆదేశాల మేరకు సుమారు 80 మంది దేవస్థానం సిబ్బంది ఈ శ్రమదానంలో పాల్గొని కోనేరును శుభ్రపరిచారు.

**భక్తులకు ఇబ్బంది కలగకుండా:** ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారికి జరిగే చక్రస్నానానికి, తెప్పోత్సవానికి కోనేరును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. భక్తులు కోనేట్లోకి దిగి పవిత్ర ప్రోక్షణ చేసుకునేందుకు వీలుగా మెట్లను, పరిసరాలను శుభ్రం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మఠం ప్రతినిధులు పాల్గొన్నారు.

## గంజహళ్లి ఉరుసులో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- పలు శాఖల అధికారుల సమావేశం

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** గంజహళ్లిలో వెలసిన మహత్మబడేసాహెబ్ స్వామి వారి ఉరుసు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సీఐ చంద్రబాబు, ఎంపీడీవో మణిమంజరి పలు శాఖల అధికారులను కోరారు. ఈ నెల 22, 23, 24 న జరుగుతున్న స్వామి వారి ఉరుసు ఏర్పాట్లుకు గాను మంగళవారం పలు శాఖల అధికారులు గంజహళ్లి దర్గా ధర్మకర్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉరుసు సందర్భంగా తాగునీరు, పారిశుధ్యం, వీది దీపాల సమస్యలు లేకుండా చూడాలి అందుకు కావలసిన ముందుస్తు జాగ్రత్తలు పై అధికారులు మాట్లాడారు. సీఐ చంద్రబాబు దర్గాను, అన్నదాన సత్రంను భక్తులు ఉండేందుకు నిర్మించిన ప్రాంతంను పరిశీలించారు. సమస్యల పై చర్చించారు. ముందుస్తు చర్యలు తీసుకోవాలని గ్రామాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ సుధాకర్రావు, మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, దర్గా ధర్మకర్త కుబేర్‌రెడ్డి, పీఠాధిపతి పూలబాషా, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటకృష్ణమనాయుడు, గోనెగండ్ల మేజర్ సర్పంచ్ హైమావతి, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు రమేష్ నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు పురపాలక సంఘము

**బహిరంగ వేలము ప్రకటన**

ఆర్.ఓ.సి.నెం. 285/2025/A1 తేది: 11-02-2026

ఎమ్మిగనూరు పట్టణములో గల ఇందిరా నగర్ తూర్పు దిక్కున గల సర్వే నెం.321 లో తూర్పు వైపున ట్యాంకు బండ్ రోడ్డు కు ఎడమ వైపున ఇందిరా నగర్‌కు మున్సిపల్ స్థలం లే అవుట్‌లో మిగులు స్థలం కలదు. ఆ మిగులు స్థలం విస్తీర్ణం 21×14చ.గలది. అక్కడి లే అవుట్‌లో మిగులు స్థలం నందు మరియు గాంధీ సర్కిల్ కు తూర్పు వైపున సలాం అంగడి నుండి దక్షిణం వైపున గల మున్సిపల్ లే అవుట్ లో మిగులు స్థలం విస్తీర్ణం 06×06 చ.మీ. గల మున్సిపల్ లే అవుట్‌లో మిగులు స్థలం నందు ఎవరైన ఈ స్థలం యందు వారి స్వంత ఖర్చులతో గుడ్ విల్ బేసిస్ క్రింద షెడ్ మాదిరిగా నిర్మించుటకు గాను ముందుకు వచ్చిన యెడల వారికి బహిరంగ వేలము ద్వారా వారికి స్థలమును కేటాయించుటకు గాను మున్సిపల్ లే అవుట్ లో మిగులు స్థలం విస్తీర్ణం 06×06 చ.మీ.కు నెలకు రూ.2,500/- మరియు 2,000/- అద్దె పై తాత్కాలికముగా వ్యాపారము చేసుకొనుటకు బహిరంగ వేలము వేలం విషయమై సదరు మున్సిపల్ లే అవుట్ లో మిగులు స్థలం ను 3 సంవత్సరములు కాలమునకు, తిరిగి చెల్లించని డిపాజిట్ (గుడ్ విల్) వేలము ద్వారా వేయబడును. తేది 18-02-2026 ఉదయం 11:00 గంటలకు మునిసిపల్ ఆఫీసు నందు కమీషనరు గారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని పై తెలిపిన మున్సిపల్ లే అవుట్ లో మిగులు స్థలం బహిరంగ వేలము నిర్వహించబడునని తెలియజేయడమైనది. సదరు పాట నందు పాల్గొన దలచిన వారు నిర్ణయించిన మొత్తములను మరియు సాల్వేన్సీ ధృవ పత్రములను రెండు రోజులు ముందుగా కార్యాలయములోని ఏ1 గుమస్తా వారికి అందజేయవలసినదిగా కోరడమైనది మరియు ఇతర వివరములు ఆఫీసు పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

| వ. నెం. | షాపు రూములు / మార్కెట్ వివరములు | కొలతలు మీటర్లలో | ఫిక్సిడ్ నెలసరి అద్దె రూ.లలో | గుడ్‌విల్ ప్రారంభ మొత్తము రూ.లలో | డిపాజిట్ రూ.లలో | బ్యాంకు గ్యారెంటీ రూ.లలో |
|---|---|---|---|---|---|---|
| 1) | ట్యాంక్ బండ్ రోడ్డు నందు ఇందిరా నగర్ ఆర్చ్ దగ్గర నెం. K-1 | 06×04 | 2,000/- | 25,000 | 18,000 | 20,000 |
| 2) | ట్యాంక్ బండ్ రోడ్డు నందు ఇందిరా నగర్ ఆర్చ్ దగ్గర నెం. K-2 | 03×02 | 1,500/- | 25,000 | 18,000 | 20,000 |
| 3) | ట్యాంక్ బండ్ రోడ్డు నందు ఇందిరా నగర్ ఆర్చ్ దగ్గర నెం. K-3 | 03×02 | 1,500/- | 25,000 | 18,000 | 20,000 |
| 4) | ట్యాంక్ బండ్ రోడ్డు నందు ఇందిరా నగర్ ఆర్చ్ దగ్గర నెం. K-4 | 03×02 | 1,500/- | 25,000 | 18,000 | 20,000 |
| 5) | ట్యాంక్ బండ్ రోడ్డు నందు ఇందిరా నగర్ ఆర్చ్ దగ్గర నెం. K-5 | 06×04 | 2,000/- | 25,000 | 18,000 | 20,000 |
| 6) | గాంధీ సర్కిల్ నందు నెం. K-6 | 03×03 | 1,500/- | 25,000 | 18,000 | 20,000 |
| 7) | గాంధీ సర్కిల్ నందు నెం. K-7 | 03×01 | 1,000/- | 15,000 | 15,000 | 10,000 |

Sd/-
కమీషనరు
ఎమ్మిగనూరు పురపాలక సంఘము

## టెక్స్ టైల్స్ పార్క్‌కు రూ.15 కోట్లు ప్రకటించడం హర్షణీయం..

సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బీవీకు కృతజ్ఞతలు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** ఎమ్మిగనూరు చేనేతల కొరకు బనవాసి వద్ద నిర్మాణం అవుతున్న టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కలుగొట్ల గ్రామంలో జరిగిన మీ భూమి మీ హక్కు రైతుల సభలో 15 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించడం హర్షనీయమని రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్‌కామర్తి మిన్నప్ప, పట్టణ టిడిపి అధ్యక్షుడు మాచాని మహేష్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ బండా నరసప్ప, టీడీపీ నాయకులు బుగిడే నాగరాజు, మాస్టర్ వీవర్స్ మోనే వెంకటేష్, బుగిడే పరమేష్, రంగస్వామి, నరసన్న, సిద్దప్ప, తిమ్మప్పలు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వర రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతల అభివృద్ధి చెందాలంటే ఒక సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అవుతుందన్నారు. ఎమ్మిగనూరులో అధికంగా ఉన్న చేనేత వర్గాల అభ్యున్నతికి ఎమ్మెల్యే బీవీ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ టెక్స్ టైల్ పార్క్ ద్వారా దాదాపు 2 వేల మందికి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు పాల్గొన్నారు.



సూర్య www.suryaa.com
బుధవారం | 11 ఫిబ్రవరి 2026

# లడ్డూల కల్తీ వ్యవహారంపై రాజకీయాలు మానుకోండి

**:- వైకాపా జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్ రెడ్డి**



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్ రెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** తిరుమల, శ్రీశైలం లడ్డూల కల్తీ వ్యవహారంపై కూటమి నేతలు చేస్తున్న అసత్య, రాజకీయ ఆరోపణలు మానుకోవాలని వైకాపా జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్ రెడ్డి హితవు పలికారు. మంగళవారం నగరంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లడ్డూల వివాదాన్ని సిఎం చంద్రబాబు రాష్ట్రంలోరోజుకో మలుపు తిప్పుతున్నారన్నారు. ఓ వైపు తిరుమల లడ్డూ, మరోవైపు శ్రీశైలం మల్లన్న లడ్డూ కూడా కల్తీ జరిగిందంటూ బాబు గగ్గోలు పెడుతున్నారన్నారు. 2014నుంచి 2019వరకు చంద్రబాబు ఇష్టారాజ్యంగా వ్యవహరించి తప్పులు చేశారన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు వ్యాఖ్యలతో హిందువులను మనోవేధనకు గురి చేస్తున్నారన్నారు. హిందువులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దూరం చేసేందుకు చంద్రబాబునాయుడు నీచ రాజకీయాలకు తెరలేపారన్నారు. ఆలయాల అభివృద్ధిలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా బిజెపి అగ్రనేతలు లడ్డూ వివాదంపై ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలన్నారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని బిజెపి నేతలకు తెలుసునని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# సాకులు చెప్పొద్దు..పనిచేసి చూపించండి..

**-కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**
**-పెద్దకడుబూరు ఎంపిడిఓ ప్రభావతి దేవి పై కలెక్టర్ ఆగ్రహం**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా అమె గ్రామంలోని ఎస్సీ కాలనీలో 1వ వార్డులో పర్యటించి అక్కడ నెలకొన్న సమస్య లను స్థానిక కాలనీ వాసులు అడిగి తెలుసుకున్నారు. అయితే కాలనీ వాసులు కలెక్టర్‌తో మాట్లాడుతూ తమ వార్డులో డ్రైనేజీలో పేరుకు పోయిన చెతచెదారం. పూడిక పేరుకోపోవుడం దుర్గంధం వ్యధ జల్లు తుందని అంతే కాకుండా మురుగు కాలువలో తాగునీటి పైపులైన్ ఉన్నందున పైపులైన్లో లీకేజీలు వల్ల ఆనీటిని తాగడం వల్ల తాము అనారోగ్యం పాలవుతున్నామని చెప్పడంతో వెంటనే ఎంపిడిఓ ప్రబావతిదేవి కలెక్టర్ కు ఏదో చెప్పి పోతుండగా అమె ఎంపిడిఓ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాకు సాకులు చేప్పోద్దు పనిచేసి చూపించాలంటూ ఎంపిడిఓ పైఒకింత అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా విధులు పట్ల అలసత్వం వహిస్తున్న అధికారులపై అగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే కాలువలో పేరుకోపోయిన పూడికతో పాటు మంచినీటి పైపులైన్లు వేసి తాగునీరు అందించాలని అమె అధికారులను ఆదేశించారు. అధేవిధంగా సిమెంట్ రోడ్డు డ్రైనేజీని ఎర్పాటు చేయాలని అమె సంబందిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 1వ వార్డులో తాగునీటి. డ్రైనేజీ. సిమెంటు రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి తాను చేస్తానని ఎస్సీ కాలనీ వాసులకు హమీఇచ్చారు. అనంతరం స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బాలురు వసతి గృహాన్ని కూడా తనఖీ నిర్వహించారు. అనంతరం జగనన్న కాలనీ సందర్శంచి ఆతర్వాత ఎ.పి మోడల్ స్కూల్‌నిఅకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అమె విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ విద్యాబోధన. వసతులు ఎలా ఉన్నాయి అని ఏవైన సమస్యలు ఉంటే నాకు నేరుగా చెప్పండిఅంటూ విద్యార్థులు యొక్క సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అలాగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో చక్కగా చదివి మంచి మార్కులసాదించాలని ఆకాంక్షించారు. ఈమె వెంట ఆదోని సబ్ డివిజన్ కలెక్టర్ అజయ్ కుమార్. పెద్దకడబూరు మండల తహశీల్దార్ గీత ప్రియదర్శిని. ఎంపిడిఓ ప్రబావతిదేవి. హౌసింగ్ పిడి. ఎంఆర్ఐ జెర్మియా. విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై సీఎం సమీక్ష

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం దేవస్థానం తోపాటు రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సీఎం నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్షించారు. ఢిల్లీ నుంచి ఆయన భక్తుల రద్దీ,కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి,హోంమంత్రి అనిత ప్రత్యేక శ్రద్దతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా,అగౌరవ పరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని ఆదేశించారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం - ఎస్సై జయప్ప

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :-** రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని రుద్రవరం ఎస్సై జయప్ప పేర్కొన్నారు. మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి పార్వేట తిరుణాల సందర్భంగా గ్రామ యూత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ సేవాదళ్ సహకారం తో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎస్సై జయప్ప రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. గ్రామ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీమ్ అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్, మస్తాన్ రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శూలం నాగార్జున, రామతీర్థం గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వందశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా పనిచేయాలి

**-30 రోజులు ప్రత్యేక రెసిడెన్సియల్ క్యాంపుకు విద్యార్థులు**

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** జిల్లా లో ఈ విద్యాసంవత్సరం పదవ తరగతి పరీక్షలలో అన్ని పాఠశాలలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ కోరారు. మంగళవారం డీఈవో గోనెగండ్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పదవ తరగతి చదువులో వెనక బడిని విద్యార్థుల కోసం 30 రోజుల ప్రత్యేక రెసిడెన్సియల్ క్యాంప్పు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మండలంలో ఎంత మంది పదవ



తరగతిలో చదువుతున్న విద్యార్థులు ఉన్నారని ఎంఈవోను అడిగి తెలుసుకున్నారు. అలాగే గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో ఎంత పదిలో చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలో చదువులో వెనక బడిన విద్యార్థులు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. పదవ తరగతిలో సీ గ్రేడ్ విద్యార్థులు, లాగ్ అబ్సెంట్ అయిన విద్యార్థులు, ఇంటి దగ్గర సరైన వసతులు లేకుండా తల్లిదండ్రుల సహకారం లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 30 రోజుల రెసిడెన్సీయల్ క్యాంప్పు ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు, డీఈవో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సూచనలు సలహాలు అందజేశారు. బాలురను ఆదోని బీసీ హస్టల్ రెసిడెన్సియల్ క్యాంప్కు, బాలికలను గోనెగండ్ల కేజీబీవీ పాఠశాలలోని రెసిడెన్సియల్ క్యాంప్ లో చేర్చనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామాంజినేయులు, నీలకంఠ, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**- ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి**
**- కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** బస్టాండ్ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మిగనూరు బస్టాండ్ లోనిటాయిలెట్స్, షాపులు, హోటల్‌లు తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. బస్టాండ్ పరిసరాల్లో శానిటేషన్ సరిగా నిర్వహించకపోవడం, పబ్లిక్ టాయిలెట్ లో డోర్ లు లేకపోవడం, పరిశుభ్రత లేకపోవడం పట్ల కలెక్టర్‌తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బస్టాండ్ పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా ప్రతిరోజూ శుభ్రపరి చే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండాటాయిలెట్‌లను శుభ్రంగా ఉంచాలన్నారు. బస్టాండ్‌లోని హోటల్ ను తనిఖీ చేస్తున్న సమయంలో వంట చేయడానికి ఎవ నూనె ఉపయోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కమర్షియల్ అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వినియోగిస్తున్నట్లు గుర్తించి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటల్ యాజమాన్యం పై


ప్రయాణికులతో మాట్లాడుతున్న కలెక్టర్

తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎస్‌ఓ ను ఆదేశించారు. షాపులను తనిఖీ చేస్తూ ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు వస్తువులను విక్రయించకూడదని కలెక్టర్ షాప్ యజమానులను హెచ్చరించారు. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, డిఎంహెచ్వో భాస్కర్, పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్, కర్నూలు బస్ స్టాండ్ డిపో మేనేజర్, ఎమ్మిగనూరు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, పాల్గొన్నారు.

# బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఓపెన్ డే

**బనగానపల్లె ,మేజర్ న్యూస్ :** బనగానపల్లె పట్టణంలోనిప్రభుత్వజూనియర్ కళాశాలలో మంగళవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రాజికా ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, అనుభవాత్మక విద్యా విధానం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ అవకాశాలు గురించి వివరించారు. విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడం ద్వారా తక్కువ



వ్యయంతో నాణ్యమైన విద్యలిలి పొందవచ్చని తెలిపారు. అలాగే ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు డిగ్రీలో చేరి ఉన్నత విద్యను కొనసాగించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, భవిష్యత్తులో స్థిరమైన కెరీర్ ఏర్పరుచుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అందించే అన్ని సౌకర్యాలు మరియు వనరులను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీమతి కౌసల్య దేవి, డా. నీతమ్మ, రామన్న, శ్రీమతి ఫైహిమ్స్, శ్రీమతి మాధవి పాల్గొని విద్యార్థులకు కళాశాలలో అందుబాటులో ఉన్న లైబ్రరీ, ల్యాబొరేటరీలు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఎన్‌సీసీ/ఎన్ఎంఎస్ కార్యకలాపాలు, క్రీడా సదుపాయాలు, వివిధ కోర్సులు, విద్యార్థి శిష్యవృత్తులు, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, డిగ్రీ కళాశాల బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అదిగదిగో శ్రీశైలం..





**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీగిరిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివస్తు న్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో పాదయాత్రగా శ్రీశైలం వైపు అడుగులు వేస్తున్నారు. భక్తుల శివ నామస్మరణతో నల్లమల అటవీప్రాంతం మారుమోగుతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కళకళలాడాయి. జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు చంద్రావతి కల్యాణ మండపం నుంచి ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసి విడతల వారీగా జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. పాతాళగంగ మార్గంలోని శివదీక్షా శిబిరాలలో జ్యోతిర్ముడి సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## పీఎం జన ఔషధీ మెడికల్ షాప్ ఏర్పాటుకు రాంకో విరాళం


రూ.3ల క్షల చెక్కు విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నంద్యాల ప్రభు త్వ ఆసుపత్రి ఆవరణంలో త్వరలో ప్రారంభం చనున్న పీఎం జన ఔషధి మెడికల్ షాప్ ఏర్పాటు కోసం కొలిమిగుండ్లలోని రాంకో సిమెంట్స్ లిమిటెడ్ యాజమా న్యం రూ.3లక్షల విరాళాన్ని అందజేసినట్లు డీఆర్వో రామునాయక్ తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచన మేరకు ఈ విరాళాన్ని అందజేయడం జరిగిందన్నారు. నిరుపేదలకు అతి తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పీఎం జన ఔషధీ మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తుండగా అందులో భాగంగా నంద్యాలలో ఈమెడికల్ షాప్‌ను రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపపారు. ఈసందర్భంగా జనరల్ మేనేజర్ శోభన్‌బాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచన మేరకు సామాజిక బాధ్యతలో భాగంగా ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు, కలెక్టర్ కార్యాలయ ఏఓ శుభకర్‌తో పాలు అధికారులు పాల్గొన్నారు.

## రూ.34లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెంకటనాయుడు

దొర్నిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చాకరాజువేముల గ్రామంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో గ్రామానికి రూ.34లక్షల రూపాయల సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నట్లు కె.సి డిస్ట్రిబ్యూటరీ కమిటి ఉపాధ్యక్షులు లింగూట్ల వెంకట నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన అన్నారు. గ్రామానికి ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని నిధులు తీసుకొని వచ్చి గ్రామాన్ని అన్ని విధాలు గా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధే సంక్షేమం పరుగు పెడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఈ పుల్లయ్య, బరిగెల చిన్న పాములేటి, కోనయ్యగారి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అస్లాం,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శివమాల స్వాములకు అన్నదానం


భోజనం వడ్డిస్తున్న ఎస్.ఐ అశోక్

అవుకు, మేజర్‌న్యూస్: అవుకు పోలీసు స్టేషన్ ఎస్.ఐ అయిన జి. అశోక్ అవుకు మండలం రామాపురం గ్రామంలో శివమాల వేసిన భక్తులకు, గ్రామ ప్రజలకు మధ్యాహ్నం భోజన కా ర్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు స్వామి మాల వేసిన భక్తులతోపాటు గ్రామ ప్రజలు అందరూ సుమారు 200 మంది భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. సదరు భోజన ఏర్పాట్లును ఎస్.ఐ దగ్గర ఉండి తన సిబ్బందితో భక్తులకు భోజనాలు వడ్డించారు.

## చర్చి పునః ప్రతిష్టకు విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ : నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామంలో సిఎస్ఐ చర్చి పునః ప్రతిష్టకు బేడ బుడగ జంగాల అధికార ప్రతినిధి 38వ వార్డు వైఎస్సార్ నగర్ ఇన్‌చార్జి బుగ్గ రాముడు రూ. 10 వేల విరాళం అందజేశారు. బుగ్గరాముడు మాట్లాడుతూ భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు సుధాకర్, సంపత్, శివ, ఏసు, టీడీపీ నాయకులు వడ్డె నాగేంద్ర, ఇమామ్ హుసేన్, రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సామూహిక వివాహాలు

హొళగుంద,మేజర్‌న్యూస్: ఆదోని రోడ్డు మార్గంలో ఉన్న సోమేశ్వరస్వామి దేవాలయంలో శివస్వాముల ఆధ్వర్యంలో బుధవారం సామూహిక వివాహాల కార్యక్రమాలు జరుగుతాయని శివస్వాములు మంగళవారం తెలిపారు. కఠోర దీక్షలో శివస్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి సామూహిక వివాహాల కార్యక్రమాలను జరిపిస్తు అలాగే శివస్వాముల ఇరుముడి కా ర్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై నూతన వధువరుల ను ఆశీర్వాదించి దైవ దర్శనం పొందాలని శివస్వాములు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# మహానందిలో శివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం

- నేడు కోఆర్డినేషన్ రెండవ సమావేశం


పనులను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, మేజర్‌న్యూస్ : మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం మహానంది క్షేత్రంలో జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను, అభివృద్ధి పనులను ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణ చేశారు. 12వ తేదీన యాగంటి కోటేశ్వరరావు మహానంది క్షేత్రానికి వస్తున్న సందర్భంగా ఆయన ప్రవచనాలను ఏర్పాటు చేశామని, వేదికను సిద్ధం చేస్తున్నామన్నారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న ఈ వేదికను ఆయన ప్రారంభిస్తారన్నారు. అలాగే విద్యుత్ అలంకరణలు, పార్కింగ్ ఏర్పాట్లు, భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా క్యూలైన్ల ఏర్పాటు పూర్తి కావస్తున్నాయని ఈవో తెలిపారు. భక్తులకు ఆహ్లాదకర వాతావరణంలో స్వామి వార్ల దర్శనం కల్పిస్తున్నామన్నారు. నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ ఆధ్వర్యంలో బుధవారం రెండవ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అధికారుల నుంచి ఏర్పాట్లపై సమీక్షించి లోటు పాట్లు ఉంటే త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలకు భక్తులు తరలి రావాలని ఆయన కోరారు.

# మీ భూమి - మీ హక్కు గ్రామసభ విజయవంతం

- ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్: మీ భూమి – మీ హక్కు గ్రామసభ ఘన విజయవంత మైందని ఎమ్మెల్యే డాక్టర్ జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో కలుగొట్ల గ్రామం – ఎమ్మిగనూరు మండ లంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన మీ భూమి – మీ హక్కు పట్టాదారు పాసుబుక్కుల పంపిణీ గ్రామసభ ఘన విజయంపై ఎమ్మెల్యే బీవీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్య మంత్రి కార్యక్రమాన్ని ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినం దుకు కలుగొట్ల, తిమ్మాపురం, దైవందిన్నె గ్రామాల ప్రజలకు అలాగే గ్రామసభ నిర్వహణలో సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సభతో పాటు అనంతరం జరిగిన పార్టీ కేడర్ సమావేశం కూడా అత్యంత విజయవంతంగా జరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు కీలక హామీ లు ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. అందులో భాగంగా గాజులదిన్నె ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 4.5 టీఎంసీలకు పెంచడం శ్రీ గురురాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మరమ్మత్తు పనులు, ఎమ్మిగనూరు బైపాస్ రోడ్, ఎమ్మిగనూరు – మాలపల్లి రోడ్డు అభివృద్ధి, కర్నూలు – తొర్నగల్ రైల్వే లైన్,ఇంటిగ్రేటెడ్ టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు గ్రామాల్లో శ్మశాన వాటికల స్థలాల కేటాయింపు, రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం, గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి, ప్రభుత్వ లోగో మరియు క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టాదారు పాసు బుక్కుల పంపిణీ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు.అలాగే బడగ జంగాల సమాజాన్ని షెడ్యూల్డ్ కులాల్లో చేర్చే అంశంపై ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందని పేర్కొన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై మాట్లాడుతూ ప్రజల విశ్వాసంతో ఆడుకున్న గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు బట్టబయలయ్యా యని విమర్శించారు. అలాగే పి 4- పూర్ టు రిచ్ కార్యక్రమం ద్వారా పేదల సంక్షే మానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంద ని, ప్రజలకు నిజమైన పాలన అందిస్తున్నా మని చెప్పారు. కార్యక్రమంలో కలుగొట్ల, తిమ్మాపురం, దైవందిన్నె గ్రామాల ప్రజలు, కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు భాస్కర్ చంద్రశేఖర్, రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ మినపప్ప మండల కమిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్షరాస్యతతోనే ఆర్థిక నిర్ణయాలు

నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో : ఆర్థిక అక్షరాస్యతతోనే ఆర్థిక నిర్ణయాలు తీసుకోవచ్చునని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ అన్నారు. భారతీయ రిజర్వు బ్యాంక్ ఆధ్వర్యంలో నేటి నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత, ఆర్థిక నిర్ణయాలు తీసుకోవ డంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పొదుపు అలవాట్లు పెంపొందించుకో వడంతోపాటు ఆర్థిక మో సాల నుంచి రక్షణ పొందడం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వారోత్సవాల్లో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్య తాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. బ్యాం కింగ్ సేవలు, బీమా, పెన్షన్ పథకాలు, డిజిటల్ ఆర్థిక భద్రతపై అవగాహన కార్యక్రమాలు వారోత్సవాల్లో నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సుభాకర్, ఎల్‌డిఎం రవీంద్రకుమార్, డైరెక్టర్ అరుణకుమారి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ


మెటీరియల్ పంపిణీ చేస్తున్న రాము యాదవ్

కర్నూలు జడ్పీ, మేజర్‌న్యూస్ : శంకరాస్ విద్యాసంస్థల అధినేత డా. హరికృష్ణ సహకారంతో నగరంలోని బి క్యాంపులోని బాలికల, బాలుర ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ ప్రశ్నాపత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. శంకరాస్, ఆదర్శ విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులకు పుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర రూరల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ అధినేత డా.వి.ఆర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రతి ఏడాది తమవంతు సహాయం అందిస్తున్నామని అన్నారు. శంకరాస్ విద్యాసంస్థల అధినేత డా. హరికృష్ణ చొరవతో ఈ పుస్తకాలు పంపిణీ చేసినట్లు రాము యాదవ్ తెలిపారు. విద్యార్థులు కృషి చేసి కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

సూర్య
బుధవారం 11 ఫిబ్రవరి 2026

# గుడిసెలను కూల్చొద్దు

◆ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** ఎరుకల కులస్తుల గుడిసెలను కూల్చవద్దని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆత్మకూరు పట్టణంలోని ఎరుకల కాలనీలో నిరుపేద ఎరుకల వాళ్ళు 40 సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకొని వెదురు బొగ్గుతో బుట్టలు అల్లి జీవనం కొనసాగిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది గత కొన్నేళ్ళుగా గుడిసెలు అక్రమంగా వేసుకున్నారు. వాటిని జెసిబితో తొలగిస్తామని కబురు పంపారు. ఈ విషయం తెలుసుకున్న ఎరుకల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాలగిరి లీలా శంకర్, రాష్ట్ర చైర్మెన్‌ను వెలుగు నాగార్జున సూచనతో ఎరుకల ఐక్యవేదిక వ్యవస్థాపకురాలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లగోండ్ల శైలజ బాధితులతో శాసనసభ సభ్యులు బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కలవడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించి వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తక్షణమే కూల్చివేత ఆపించి నిజంగా ఇళ్ళు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం చూపిస్తామని అంత ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కమిషనర్‌కు చెప్పడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క పేదవారు కూడా నష్టపోకూడదని, నియోజకవర్గ శాసనసభ సభ్యులు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేదల పట్ల వారు ఉదారతతో నిజంగా ఇళ్ళు కోల్పోతున్న ఎరుకల వారికి స్థానిక తహశీల్దార్‌కు చెప్పి గుడిసెలు వేసుకున్న ప్రదేశంలోనే ఇళ్ళ పట్టాలు ఇప్పిస్తానని చెప్పడం జరిగింది. ఈ విషయం పట్ల శైలజ మాట్లాడుతూ భవిష్యత్‌లో మన నియోజక వర్గ ఎమ్మెల్యే లాంటి నాయకులు ఉంటే రాష్ట్రంలో ఒక నిరుపేద కూడా ఉండరని హర్షం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే బుడ్డాకు సమస్యను వివరిస్తున్న కాలనీ వాసులు

## బాలకృష్ణ అభిమానుల ఆర్థిక సాయం

**డోన్, మేజర్‌న్యూస్:** ఉమ్మడి కర్నూలు జిల్లా, డోన్ నందమూరి బాలకృష్ణ, మోక్షజ్ఞ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యస్.హుస్సేన్‌పీరా అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బందులు ఎదురుకుంటున్నాడు. ఆయన పరిస్థితిని చూసి బాలకృష్ణ అభిమానులు తమవంతు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చారు. మంగళవారం నందమూరి బాలకృష్ణ, మోక్షజ్ఞ ఫ్యాన్స్ అసోసియేషన్ కన్వీనర్ జె.చంద్రశేఖర్ రూ.5వేలు, కర్నూలు బాలకృష్ణ, మోక్షజ్ఞ సేవ సమితి అధ్యక్షులు మిత్ర బృందం రూ.12వేలు, అదేవిధంగా కర్నూలు అభిమానులు రమణ, శివ, రామ్మోహన్, శ్రీనివాసులు, వెంకటస్వామి, కృష్ణమూర్తిలు రూ.10వేలు, ఎమ్మిగనూరు బాలకృష్ణ, మోక్షజ్ఞ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ రూ.5వేలు, కోడుమూరు అధ్యక్షుడు అమడగుంట్ల మాదన్న రూ.5వేలు, తూర్పు గోదావరి జిల్లా మండపేటకు చెందిన బాలకృష్ణ అభిమాని పడాల రామారెడ్డి రూ.5వేలు మొత్తం రూ.42వేల ఆర్థికసాయాన్ని హుస్సేన్‌పీరాకు అందజేశారు. కార్యక్రమంలో అభిమానుల సంఘం నాయకులు కర్నూలు లతీఫ్, రామానాయుడులు పాల్గొన్నారు.



హుస్సేన్‌పీరాకు ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

## జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** ఈనెల 12వ తేదిన జరిగే దేశవ్యాప్త జాతీయ సమ్మెను కార్మికులు, వీధి విక్రయ వ్యాపారస్తుల సంఘం పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటియుసి అనుబంధ చిన్న వ్యాపారస్తుల జిల్లా కమిటీ సభ్యుడు కె.రామాంజినేయులు, మండల కార్యదర్శి అనీల్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెల్దుర్తిలోని వారం, సంతమార్కెట్ రోజువారి చిరు వ్యాపారం సుంకాలు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు కాబట్టి సుంకం రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో ఏఐటియుసి మండల అధ్యక్షుడు మాధవస్వామి, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు బషీర్, వెంకటేష్, దాసరి వెంకటేష్, బుడగ జంగాల వ్యాపారస్తులు, వీధి వ్యాపారస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చించాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు హుసేన్ బాష, శిరీష, సహాయ కార్యదర్శులు ప్రకాష్, రవిలు డిమాండ్ చేశారు. మంగళవారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లాలు మాట్లాడుతూ ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా లక్షల్లో ఉద్యోగా లు ఇచ్చామని ప్రచారం చేసుకోవడం కూటమి ప్రభుత్వానికి చెల్లుబాటు అవుతుందన్నారు. నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలపై నేటి నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ బృతి ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

## నన్నూరులో గడ్డివామి దగ్ధం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో సోమవారం రాత్రి గ్రామానికి చెందిన రవికెల చాంద్ బాషా గడ్డివాము పూర్తిగా దగ్ధం కావడంతో తీవ్రంగా నష్టపోయాడు. స్థానికులు సమాచారం అందించడంతో వెళ్లి చూడగా అప్పటికే గడ్డివాముకు మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయిందని, ఈ ఘటనలో సుమారు రూ.4లక్షల మేర నష్టం వాటిల్లిందనిబాధితుడు తెలిపారు. సమాచారం అందు కున్న అగ్నిమాపక శాఖ ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. తన వద్ద 30పశువులు ఉన్నాయని వాటికి అవసరమైన మేత కాలిపోయిందని ఈ అగ్ని ప్రమాదంలో తన జీవనాధారం దెబ్బతిన్నందున ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. తహశీల్దార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం నుండి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయమై బాధితుడు ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు విజయుడు, కాజామియా, శంషుద్దీన్, కటిక హసన్, సర్కార్, పట్టేలా మోహన్, శ్రీపతి బుజ్జప్ప, మునిస్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడికి న్యాయం చేయాలని కోరారు.



గడ్డివామును పరిశీలిస్తున్న తహశీల్దార్

## పాఠశాలకు కుషన్ కుర్చీలు అందజేత



నారాయణ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**చాగలమర్రి, మేజర్‌న్యూస్:** పూర్వపు విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు వితరణగా (విరాళాలు, సేవలు) అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి ఇటీవల పదవి విరమణ చెందిన మండలంలోని పెద్దవంగలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ రెడ్డి తాను చదువుకున్న పాఠశాలకు రూ.16వేలు విలువ చేసే 10 కుషన్ కుర్జీలను వితరణగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవయ్యకు అందజేశారు. తాను చదువుకున్న పాఠశాల కోసం తన ధాతృత్వాన్ని చాటుకున్న నారాయణ రెడ్డిని అభినందిస్తూ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐ.వి.కె క్రిష్ణ శాస్త్రి, నారాయణ మూర్తి, శివశంకర్, పి.డి శ్రీనాథ్ రెడ్డి, మహాబ్ బాషా తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని చట్నేహళ్ళి గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ రఘు మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైఎస్సార్సిపి మండల అధ్యక్షులు భీమారెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య చట్నేహళ్లి గ్రామానికి చేరుకొని రఘు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తక్షణ సహాయం కింద రూ.10వేల నగదును అందజే శారు. మృతుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## కృష్ణారెడ్డిని పరామర్శించిన బుగ్గన అర్జున్‌రెడ్డి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** కంటి చికిత్స చేయించుకొని, విశ్రాంతి తీసుకుంటున్న వైయస్ ఆర్‌సిపి సీనియర్ నాయకులు బోరెడ్డి కృష్ణారెడ్డిని మంగళవారం డోన్ నియోజకవర్గం వైయస్ఆర్‌సిపి యువనేత బుగ్గన అర్జున్‌అమర్‌నాథ్ రెడ్డితోపాటు శివ, పెద్ద సుంకయ్యలను పరామర్శించారు. అదేవిధంగా చంద్రపల్లి, మాధవరం గ్రామాలలోని వైయస్ఆర్‌సిపి కుటుంబాలను బుగ్గన అర్జున్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వైయస్ఆర్‌సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ పోతుదొడ్డి కృష్ణమూర్తి, వైకాపా నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, బొర్రా మల్లికార్జునరెడ్డి, గడ్డం భువనేశ్వరరెడ్డి, చిన్న సుంకయ్య, బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్‌ఖాన్, కమతం భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్, కొండయ్య, రామ్మూర్తి, నాగరాజు, పాండు, సంజీవరెడ్డిలు ఉన్నారు.



బోరెడ్డి కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

## క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** స్థానిక పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారిని స్వాతి క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు వినియోగించుకోవాలని పోస్టర్లతో ప్రదర్శన చేసి రైతులకు క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు బుకింగ్ చేసుకునే విధంగా ప్లే స్టోర్‌లో యువరైజేషన్ కిసాన్ యాప్ ద్వారా అందుబాటులో ఉంచారు. ఈ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డ్రోన్ సేవలను సులభంగా బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ డ్రోన్ ద్వారా పురుగు మందులు, ఎరువులు, పిచ్చికారి చేసుకోవడానికి తక్కువ సమయం, వ్యయం గణనీయంగా తగ్గుతుందని రైతులకు తెలిపారు. దీనిపై రైతులకు వివరంగా తెలిపారు.



రైతులతో వ్యవసాయ అధికారి

## ఆటో కార్మికుడు మృతి

**శిరివెళ్ళ, మేజర్‌న్యూస్ :** శిరివెళ్ళ మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ఆటో డ్రైవర్ షేక్ అంజన పామిడిషావలి(33) మంగళవారం గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న నేషనల్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి చిన్న కోటపాడులోని సంఘటన స్థలానికి వెళ్లి మృతుదేహాన్ని సందర్శించి పూల మాలు వేసి నివాళ్లు అర్పించారు. మృతుడు అత్యవసర సమయంలో గర్భిణిలకు, బాలికలకు ఉచితంగా ఆటో సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సుమారు 18సంవత్సరాల నుండి అత్యవసర సమయంలో మహిళలకు ఉచిత ఆటో సర్వీసు అందించి ప్జల మన్ననలు పొందారు. గ్రామంలో మంచిపేరు ఉన్న ఈ వ్యక్తికి ప్రజలు పలువురు ప్రముఖులు నివాళ్లు అర్పించారు. మృతుడికి బార్య , కూతురు, కుమారుడు ఉన్నారని మృతుడి కుటుంబం నిరుపేద కుటుంబానికి చెందిందని మృతి చెందిన ఆటో డ్రైవర్‌కు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోటపాడు ప్రజలు కోరుతున్నారు.



నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

## 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్** :పిల్లల్లో సాధారణంగా కనిపించే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, నీరసం, ఆందోళన, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలకు కడుపులో నులిపురుగులు చేరడమే ప్రధాన కారణమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని గోడపత్రిక ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండుసార్లు, ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే ఈకార్యక్రమం ద్వారా 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, విద్యార్థులకు ఆల్బెండజోల్ 400మి.గ్రామ మాత్రలు మింగించబడతాయని తెలిపారు. 17న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్, డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు వేసుకోవచ్చున్నారు.

## ఆర్థికాభివృద్దే లక్ష్యంగా రుణాలు అందజేత


మహిళలకు రుణాల చెక్కులను పంపిణీ చేస్తున్న నాగిని రవి సింగారెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్** :నంద్యాల పట్టణంలోని శిల్పా సేవ సమితిలో అతి తక్కువ వడ్డీ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నంద్యాల నియోజకవర్గంలోని 140మంది మహిళలకు దాదాపు రూ.23లక్షలు రుణాలను పంపిణీ చేయడం ద్వారా మహిళలకు ఒకేసారి ఆర్థిక ప్రయోజనం చేకూరింది. ఈసందర్భంగా చైర్‌పర్సన్ నాగిని రవి సింగారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గెలుపు ఓటములకు సమానంగా మహిళలకు రుణాలను పంపిణీ చేయడం జరుగుతుందని అదే విధంగా మహిళలు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడానికి ఆర్థికంగా స్థిరపడడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, సేవా సమితి సభ్యులు లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

## యాళ్లూరు ఉర్దూ పాఠశాల వసతుల కల్పనకు కృషి


సమస్యలు తెలుసుకుంటున్న నశ్యం సోదరులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్** : నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలం యాళ్ళూరు గ్రామంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తామని నశ్యం సోదరులు హామీ ఇచ్చారు. మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలో వసతుల లేమిపై తెలుగుదేశం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, రాష్ట్ర టీడీపీ నాయకులు ఫయాజ్‌ల దృష్టికి తీసుకొని వెళ్ళారు. పాఠశాలను పరిశీలించిన నశ్యం సోదరులు సమస్యలను స్థానికులు, తల్లిదండ్రుల నుంచి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ విషయాన్ని మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకొని వెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**హొళగుంద,మేజర్‌న్యూస్**: ఈ నెల 12వ తేదిన సిఐటీయూ ఆధ్వర్యంలోజరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు,సిఐటీయూ మండల కార్యదర్శులు వెంకటేశ్, నాగరాజులు కోరారు. మంగళవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి రాజశేఖర్‌గౌడకు,రెవిన్యూ అధికారులకు వారు వినతిపత్రం ఇచ్చారు.కేంద్రంలో బిజేపి ప్రభుత్వం ఆధికారంలో వచ్చిన తరవాత కార్మికులు కర్షకులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు.ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న కార్మికులకు కనీసం నెల వేతనం రూ 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తలారిలు మల్లయ్య, సిద్దలింగ, సిద్దప్ప,తాయన్న, కార్మికులు మాబుసుభాన్,బాషా,వీరభద్రగౌడ,మోధిన్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు ఆన్‌లైన్ మొసాలపై జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**హొళగుంద,మేజర్‌న్యూస్**: సైబర్ నేరగాళ్ళ,ఆన్‌లైన్ మోసాలు నకిలీ వెబ్‌సైట్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ నాగరాజు,హెడ్ కాన్సిటేబుల్ లక్ష్మీనాయక్‌లు తెలిపారు.సఫర్ ఇంటర్నెట్ దినోత్సవ సందర్బంగా మంగళవారం రివా ప్రవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులచే ర్యాలీ కార్యక్రమం,స్థానిక బస్టాండ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆన్‌లైన్‌లో,వైబ్‌సైట్‌లో,ఓటిటి పలు రకాల ద్వార సైబర్ నేరగాళ్ళు మోసం చేస్తుంటారని వినియోగదారులు చాలా జాగ్రత్త వహించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేక్షావలి,హెడ్‌మాస్టర్ షైనజ్‌బేగంఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ప్రమాదం..చిన్నారికి గాయాలు

◆ **హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బండిమెట్ట ప్రాంతంలోని ఎంపిఎల్ కార్పో ప్రైమరీ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న షేక్ హసీనా అనే చిన్నారికి చెత్త అంటుకుని తీవ్ర గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు ఇలా వున్నాయి. సోమవారం మధ్యాహ్నం తోటి విద్యార్థినీలతో ఆడుకుంటుండగా చిన్నారులు అనుకోకుండా అగ్గిపుల్లలు వెలిగించారు. అక్కడే ఉన్న చిత్తు కాగితాలు అంటుకోవడంతో పక్కనే ఉన్న చిన్నారి హసీనా దుస్తులపై నిప్పు అంటుకున్న కాగితాలు పడి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో హసీనాకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న టీచర్, స్థానికులు గమనించి మంటలు ఆర్పి గాయాలపాలైన విద్యార్థినిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కర్నూలు ఎంఈఓ అబ్దుల్ రహిమాన్, అధికారులు పాఠశాలకు వెళ్లి ప్రమాదానికి గల కారణాలు హెచ్‌ఎం జాన్సన్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వద్దకు వెళ్లి విద్యార్థినిని పరామర్శించారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. దీనిపై వన్ టౌన్ పోలీసులు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


చిన్నారిని పరామర్శిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి : విద్యార్థి సంఘాల నాయకులు

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపిఎల్ కార్పో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి అధ్యక్షులు రవికుమార్, రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్పలు డిమాండ్ చేశారు. మంగళవారం స్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసిన నాయకులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న ఐఎన్‌టియుసి నాయకులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవని జిల్లా ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతుకన్న, నాయకులు మంగళవారం నగరంలోని రైల్వే స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కర్నూలు నుండి అమరావతికి ఇంటర్ సిటీ రైళ్లను నడపాలని అలాగే కర్నూలు రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ ముఖదం, ఆనందం, సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సంస్థలకు అమ్ముడుపోయిన కేంద్రం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అమ్ముడుపోయి ప్రజల సమస్యలను విస్మరిస్తుందని ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి విమర్శించారు. దేశంలో విద్యార్థినులు, మహిళలపై వేధింపులు పెరుగుతున్నా అరికట్టడంలో పాలకులు విఫలం అవుతున్నారన్నారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా భద్రతను గాలికి వదిలేసి కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రభుత్వం పని చేస్తుందని ఆరోపించారు. జిల్లా నాయకురాలు సుశీలమ్మ, మున్ని, పద్మలు మాట్లాడుతూ మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యా సంస్థలు, హాస్టల్ పరిసరాల్లో ఆకతాయిల ఆగడాలు మితిమిరిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకొని భద్రత కల్పించాలని పోలీసులను, అధికారులను కోరారు.

## డ్రోన్ పెట్రోలింగ్‌తో స్మార్ట్ నిఘా


డ్రోన్ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ : కర్నూలు జిల్లాలో నేర నియంత్రణకు సాంకేతికతను వినియోగించి డ్రోన్ పెట్రోలింగ్‌తో స్మార్ట్ నిఘాను ప్రారంభించామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో డిజీపి కార్యాలయం నుండి కేటాయించిన 3 నూతన డ్రోన్ కెమెరాలను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డే అండ్ నైట్ విజన్ సౌకర్యంతో పనిచేసే ఈ డ్రోన్‌లు జిల్లావ్యాప్తంగా నిరంతర నిఘా నిర్వహించనున్నాయన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కాలేజీలు, పాఠశాలల ప్రత్యేక నిఘాకు ఉపయోగపడతాయన్నారు.

## పూచీ ఇచ్చిన పాపానికి ఆత్మహత్య


మృతిచెందిన అనంతకుమార్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** అప్పులు ఇచ్చినప్పుడు పూచీగా ఉన్న పాపానికి అనంతకుమార్ (55) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన 4వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కల్లూరు ఎస్టేట్‌లోని పోలీస్ కాలనీలో నివాసముంటున్న అనంత కుమార్ ముజఫర్ నగర్‌కు చెందిన సిద్దేశ్వర రెడ్డి అనే వ్యక్తి వద్ద తనకు తెలిసిన మహిళకు రూ.1లక్ష50వేలు అప్పు ఇప్పించాడు. అయితే అప్పు తీసుకున్న మహిళ అప్పు కట్టకపోవడంతో సిద్దేశ్వర రెడ్డి అనంత కుమార్ అతని తమ్ముడు శ్రీనివాస్‌లను అప్పు కట్టమని ఒత్తిడి తేవడంతో అనంతకుమార్ మనస్థాపానికి గురై సోమవారం పందిపాడు సమీపంలోని పొలాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తమ్ముడు, స్థానికులు ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈ విషయమై తమ్ముడు శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే చనిపోయిన వ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. మృతుడికి వివాహం కాలేదు.

## అనుమతులు లేకుండా... అసత్య ప్రచారం తగదు


కమిషనర్ విశ్వనాథ్

**కర్నూలు (కేఎంసీ), మేజర్‌న్యూస్ :** నగరంలోని స్టాంటన్ కాంపౌండ్ పరిధిలోని అనుమతులు లేకుండా చేపట్టిన భవన నిర్మాణ పనులను నిలిపివేయడంపై ఓ వర్గం అసత్య ప్రచారం చేయడం తగదని నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చట్టబద్దమైన అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్దమని స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబరులోనే అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేయాలని రెండుసార్లు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సరైన పత్రాలు సమర్పించి అధికారిక అనుమతులు పొందాలని సంబంధిత వ్యక్తులను కోరినట్లు పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన ఏపిడిపిఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, లిఖిత పూర్వకంగా ఎండార్స్‌మెంట్ ఇచ్చినట్లు వెల్లడించారు. చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని కమీషనర్ హితవు పలికారు.

సూర్య



## శ్రీశైలం మల్లన్నకు పట్టు వస్త్రాల సమర్పణ



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలం మల్లన్నకు శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాలను సమర్పించారు. దేవస్థానం చైర్మన్ రాధాకృష్ణ, ఈవో సీనా నాయక్ మేళ తాళాలతో ఆలయ ప్రవేశం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పట్టు వస్త్రాలను శాస్త్రోక్తంగా సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

## ప్రజల ముంగిటకే...
## మీ మున్సిపల్ కమిషనర్

**డోన్, మేజర్‌న్యూస్ః** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ కమీషనర్ అట్ యువర్ డోర్ స్టెప్ అనే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ పట్టణంలోని 16 వార్డు సచివాలయాలను ప్రతిరోజు ఒక సచివాలయం చొప్పున ఆ వార్డులలోని ప్రజల ఇంటింటికి స్వయంగా వెళ్ళి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ కమీషనర్ నేరుగా ఇంటి వద్దకే రావడంతో ప్రజల నుండి సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. అనంతరం సమస్యలను తెలుసుకున్న కమీషనర్ దగ్గరుండి డ్రైనేజి సమస్యలను పరిష్కరించారు. వార్డు సచివాలయ సిబ్బంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ తరపున ఎటువంటి సమస్యలు ఉండకూడదని ప్రజల సమస్యలను తీర్చడంలో అలసత్వం చూపించిన ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగి ఎవ్వరు ఏ బాద్యతలు నిర్వహిస్తారనే సమాచారాన్ని ప్రతి ఇంటి దగ్గర కరపత్రాల (పాంప్లెట్) రూపంలో అతికించి వార్డులలోని ప్రజలు నేరుగా సచివాలయం ఉద్యోగులకు సమస్యలు ఫోన్ ద్వారా తెలుపవచ్చని,ఉద్యోగి స్పందించకపోతే టోల్‌ఫ్రీ నెంబర్, మున్సిపల్ కమీషనర్ నెంబర్‌లను ప్రజలకు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి గ్లౌస్, బూట్లు, ఇతర వస్తువులను అందజేశారు.



సమస్యలు తెలిపేందుకు కరపత్రాలను సచివాలయ సిబ్బందికి అందిస్తున్న కమిషనర్ ప్రసాద్‌గౌడ్

## కర్నూలు-విజయవాడకు
## ఇంటర్ సిటీ ట్రైన్ నడపాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర రాజధాని ప్రాంతానికి మెరుగైన కనెక్టివిటీ అవసరాన్ని ఎత్తి చూపుతూ కర్నూలు నుండి విజయవాడకు రోజు వారి రైలు సర్వీసును నడపాలని బిజెపి నాయకులు కుర్ని వెంకటేశ్వర్లు, పిటి సాయి ప్రదీప్, ఉమా మహేశ్వరప్ప, పవన్ కుమార్‌లు అన్నారు. మంగళవారం నగరంలోని రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవకి బిజెపి బృందం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంగా పరిగణించబడే కర్నూలు ప్రాంతం అభివృద్ధికి తోడ్పడటానికి అదనపు రైల్వే సౌకర్యాలు అవసరమన్నారు. రాయలసీమకు ప్రవేశ ద్వారంగా కర్నూలు ఉందన్నారు. కర్నూలు, విజయవాడకు మెరుగైన, ప్రత్యక్ష రైలు కనెక్టివిటీకి అవసరమైనదని, రోజువారి రైలు సర్వీసు ప్రత్యేక రైళ్ల కంటే ప్రయాణికులకు సహాయం చేయడానికి, మౌలిక సదుపాయాలు మెరుగు పరచడానికి రోజు వారి సర్వీసు కోసం డిమాండ్ ఉందన్నారు. అలాగే పంచలింగాలలోని మిడ్ వైఫ్ రిహాబిలిటేషన్ షెడ్(వాగన్ వర్క్‌షాప్) ఏర్పాటు ద్వారా 5వేల మందికి ఉపాధి దొరుకుతుందని వెంటనే పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు మరిన్ని సమస్యలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవకి వినతిపత్రం అందచేసిన బీజేపీ బృందం

# భక్తులకు సమగ్ర ఏర్పాట్లు చేయండి

- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షోరాణ్

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి విచ్చేయు లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. దేవస్థానం ప్రారంభ ద్వారం నుండి భక్తుల క్యూ లైన్లు, క్యూ లైన్లలో ఏర్పాటు చేసిన త్రాగునీరు, అల్పాహార పంపిణీ కేంద్రాలు,శానిటేషన్ ఏర్పాట్లు తదితర అంశాలను చివరి వరకు పరిశీలించి,మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. శివ స్వాములు విశ్రాంతి తీసుకునే చంద్రావతి కళ్యాణ మండపాన్ని సందర్శించి అక్కడ కల్పించిన సదుపాయాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గుడి వెలుపల ఉన్న క్యూ లైన్ల నుండి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమణ వరకు ఏర్పాటైన మార్గాలను తనిఖీ చేసి, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అల్పాహారం,త్రాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి భక్తుడిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రధాన ద్వారం నుండి దర్శనం అనంతరం నిష్క్రమణ మార్గాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు పోలీసు అధికారుల సూచనలను పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రావు,దేవస్థాన అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్



భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

## శ్రీశైలంలో ఏలాంటి లాఠీ ఛార్జ్ జరగలేదు

- నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షారాణ్

**శ్రీశైలం, మేజర్ న్యూస్:** శ్రీశైలంలో ఏలాంటి లాఠీ ఛార్జ్ జరగలేదని జిల్లా ఎస్పీ సునీల్ షారాణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు దేశ నలుమూల నుండి శ్రీశైలానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యూ లైన్ ల రద్దీ నేపథ్యంలో కొందరు వృద్ధులు అసస్తకు గురై ఆలయ ప్రధాన గేటు వద్ద సేద తీరుతున్నారని, ఆ సమయంలో ఒక్కసారిగా శివ స్వాములు లోనికి ప్రవేశించేటప్పుడు వృద్ధులకు అపాయం జరగకుండా అక్కడ విధుల్లో ఉన్న ఏఎస్పీ యుగంధర్ బాబు వారిని నిలువరించారన్నారు.



## శ్రీశైలంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ



జిల్లా ఎస్పీతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

**శ్రీశైలంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ :** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో భద్రత ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ పరిశీలించారు. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించి అనంతరం కమాండ్ కంట్రోల్ రూంను తనఖీ చేశారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ పై పలు సూచనలు చేశారు. అలాగే భక్తులు కూడా సంయమనం పాటిస్తూ దర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నంద్యాల మున్సిపాలిటీ వార్షిక
# బడ్జెట్‌కు ఆమోదం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల మున్సిపాలిటీకి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 10254.29లక్షలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన కమిషనర్ శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. బడ్జెట్‌లో ఆదాయ వనరులుగా ఆస్తిపన్ను, ఖాళీ స్థల పన్ను, నీటి చార్జీలు, వ్యాపార లైసెన్స్ ఫీజులు, షాపు అద్దెలు, భవన తదితర ఆదాయాలను పొందుపరిచారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, పథకాల నిధులు కూడా చేర్చారు. ఖర్చుల విభాగంలో వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా, తదితర సేవలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పట్టణాభివృద్ధి దిశగా రోడ్లు, కాల్వలు, తాగునీటి లైన్లు, వ్యర్థాల నిర్వహణ, తదితర వసతులకు నిధులు కేటాయించారు. ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఎంఈ గుర్రప్ప, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, డీఈలు నాగభూషణ్‌రెడ్డి, పవన్‌కుమార్, రసల్, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శివప్రసాద్‌రెడ్డి, రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి, మెప్మా సీఎం భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నీసా



బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు